నమస్తే తెలంగాణ
నాగర్‌కర్నూల్
12 | మహబూబ్‌నగర్, శనివారం 16 నవంబర్ 2024 | NAGARKURNOOL

మంచాలకట్ట వద్ద నిషేధిత అలవి వలలతో ఉన్న మరబోటు

అలవి వలలతో వేట

నదీతీరం వెంట నిషేధిత అలవి వలలతో చేపల వేట జోరుగా కొనసాగుతున్నది. అయినా అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఇక్కడి నుంచి చేపల రూపంలో మన సంపదను దోచుకెళ్తున్నారు. ఆంధ్రాలోని తుని, కొవ్వూరు, రాజమండ్రి, పూడిమార్క, గాజువాక, విజయవాడ, వైజాగ్ తదితర ప్రాంతాల జాలర్లతోపాటు ఒడిశా, జార్ఖండ్ నుంచి మత్స్యకారులను తీసుకొచ్చి వసతులు కల్పించి.. వారిని ప్రోత్సహించడంతో అలవి వలలతో వేట ముమ్మరంగా సాగుతోంది. వలల ద్వారా చిన్న చేపపిల్లల(గుడ్డు)ను సైతం వదలకుండా జాలర్లు వేటాడుతున్నారు.

కృష్ణాతీరంలో మకాం..

ఆంధ్రా జాలర్లు కృష్ణా తీరంలో మకాం వేశారు. నదీ తీర పల్లెలైన వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం గూడెం, పెద్దమారూర్, చిన్నమారూర్, చెల్లెపాడు గ్రామాలను మొదలుకొని.. నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలం జటప్రోల్, మంచాలకట్ట, వేంకల్, మల్లేశ్వరం, సోమశిల, అమరగిరితో పాటు కోతిగుండు, చీమలతిప్ప వద్ద ఒడ్డున తాత్కాలిక షెడ్లు, గుడారాలు ఏర్పాటు చేసుకున్నారు. నిత్యం వారి కార్యకలాపాలను సాగిస్తున్నారు.

బీఆర్ఎస్ హయాంలో నీలివిప్లవం.. కాంగ్రెస్ వచ్చాక జీవనోపాధికి గండి

కేసీఆర్ ప్రభుత్వంలో రాష్ట్రంలో మత్స్య సంపద గణనీయంగా పెరిగింది. నాటి సర్కారు మత్స్యకారులకు జీవనోపాధి కల్పించడంతోపాటు ఆర్థికాభివృద్ధి కోసం కృషి చేసింది. ఇందులో భాగంగా ఉచితంగా చేపపిల్లలను ప్రతి ఏటా మత్స్యకారులకు అందజేసింది. వాటిని చెరువులు, కుంటలు, రిజర్వాయర్లు, నదుల్లో విడిచి పెద్దయ్యాక పట్టి మార్కెట్లో విక్రయించి ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మత్స్యకారుల జీవనోపాధికి గండి కొట్టింది. మన సంపదైన చేపలను ఇక్కడ నుంచి సీమాంధ్ర జాతర్లు దోచుకెళ్తున్నా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం సోమశిల సమీపంలో పారుతున్న కృష్ణానది (శ్రీశైలం బ్యాక్ వాటర్) చేపల దందాకు కేరాఫ్‌గా మారింది. ఆంధ్రా దళారులు రూ.కోట్లు అక్రమంగా ఆర్జిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

విజయీభవ!

- గ్రూప్-3 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 154 కేంద్రాలు
- హాజరుకానున్న 50,025 మంది అభ్యర్థులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబర్ 15 : గ్రూప్-3 పరీక్షకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ నెల 17, 18వ తేదీల్లో జరిగే పరీక్షలకు ఉమ్మడి జిల్లాలో 154 కేంద్రాలు ఏర్పాటు చేయగా, 50,025 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు. కేంద్రాల వద్ద అభ్యర్థులకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పరీక్ష నిర్వహణకు ఇప్పటికే ఆయా జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్ సమావేశాలు నిర్వహించి డిపార్ట్‌మెంటల్ అధికారులు, జాయింట్ రూట్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్, ఐడెంటిఫికేషన్ అధికారులు, పోలీసు నోడల్ అధికారులు, సిబ్బందిని నియమించారు. పొరపాట్లకు తావులేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. పరీక్ష ఆదివారం రెండు విడుతలు, సోమవారం ఒక విడుత పరీక్ష ఉంటుంది. 8:30 నుంచి 9:30 గంటల వరకు, మధ్యాహ్నం 1:30 నుంచి 2:30గంటల వరకు అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమతిస్తారు. కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. కేంద్రాల సమీపంలో ఉన్న జిరాక్స్ కేంద్రాలను సమయంలో మూసివేయాలని ఆదేశాలున్నాయి. అభ్యర్థుల హాజరు బయోమెట్రిక్ విధానంలో నమోదు చేయనున్నారు.

అభ్యర్థులు, కేంద్రాలు ఇలా..

మహబూబ్‌నగర్ జిల్లాలో 19,465 మంది అభ్యర్థులు పరీక్ష రాయనుండగా, 52 కేంద్రాలు ఏర్పాటు చేశారు.

వనపర్తి జిల్లాలో 8,312 మంది అభ్యర్థులకు 31 కేంద్రాలు, నారాయణపేటలో 4,200 మందికి 13 కేంద్రాలు, నాగర్‌కర్నూల్‌లో 9,478 మంది అభ్యర్థులకు 33 కేంద్రాలు, జోగుళాంబ గద్వాల జిల్లాలో 8,570 మంది అభ్యర్థులు పరీక్ష రాసేందుకు 25 కేంద్రాలు ఏర్పాట్లు చేశారు.

అభ్యర్థులకు సూచనలు..

- పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్ టికెట్‌ను ఏ-4 సైజ్ పేపర్‌లో కలర్ ప్రింట్ తీసుకోవాలి.
- హాల్‌టికెట్‌పై పాస్‌పోర్టు సైజ్ ఫొటో అతికించాలి. డౌన్‌లోడ్ చేసిన హాల్‌టికెట్‌పై ఫొటో సరిగ్గా ముద్రించకుంటే సదరు అభ్యర్థి గెజిటెడ్ అధికారి లేదా చివరగా చదువుతున్న విద్యాసంస్థ ప్రిన్సిపాల్ అటెస్టేషన్‌తో మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతోపాటు వెబ్‌సైట్‌లో పొందుపర్చిన ధ్రువీకరణ పత్రాన్ని పూర్తి చేసి ఇన్విజిలేటర్‌కు అందించాలి.
- షూస్ ధరించకూడదు, ఎలక్ట్రానిక్ పరికరాలు కేంద్రంలోకి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరు.
- భయం వీడి పరీక్షకు హాజరుకావాలి.

- కృష్ణానదిలో అలవి వలలతో చేపల వేట
- ఇక్కడి చేపలను ఏపీకి తరలిస్తున్న వైనం
- సంపద తరలుతున్నా పట్టింపు కరువు
- ఏటా అధికారులకు రూ.లక్షల్లో ముడుపులు
- యథేచ్ఛగా ఆంధ్రా జాలర్ల అక్రమ దందా

పెంట్లవెల్లి మండలం మంచాలకట్ట వద్ద అలవి వలలతో చేపల వేట కొనసాగిస్తున్న ఆంధ్రా జాలర్లు

జలపుష్ప విలాపం!

అలివి వలలు వాడితే చర్యలు..

కృష్ణానదీతీర ప్రాంతంలో నిషేధిత అలవి వలలతో చేపలు పడుతున్నారన్న సమాచారం తెలిస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం. మత్స్యకారుల కుటుంబాల అభ్యున్నతి కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నది. స్థానిక మత్స్యకారుల జీవనోపాధికి గండి కొట్టే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు. నిషేధిత వలలతో చేపలు పడుతున్నట్లు ఫిర్యాదులు అందితే రెవెన్యూ, పోలీస్ శాఖాధికారులతో కలిసి దాడులు చేస్తాం.. కేసులు నమోదు చేస్తాం..

- రమాదేవి, జిల్లా మత్స్యశాఖాధికారి, నాగర్‌కర్నూల్

పెంట్లవెల్లి, నవంబర్ 15 : కృష్ణానదిలో నిషేధిత వలలతో ఆంధ్రా జాలర్లు చేపల వేట కొనసాగిస్తున్నారు. తెలంగాణలోని రూ.కోట్ల సంపదను ఏపీకి దోచుకెళ్తున్నారు. ఇక్కడి నుంచి మన చేపలను తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏటా అధికారులకు రూ.లక్షల్లో ముడుపులు ముడుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఆంధ్రా జాలర్లు యథేచ్ఛగా అక్రమ దందాకు తెరలేపారు.

పేరుకే తనిఖీలు..

కృష్ణానదిలో అలవి వలలతో ఆంధ్రా, సీమ జాలర్లు చేపల వేట కొనసాగిస్తున్నారని స్థానిక మత్స్యకారులు పలుమార్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. అయినా భయపడేదే లేదన్నట్లు వారి వేటను మూడు పువ్వులు.. ఆరు కాయలుగా కొనసాగిస్తున్నారు. ఈ విషయంపై మత్స్యశాఖాధికారులకు ఫిర్యాదు చేసినా చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని మన మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. అధికార పార్టీ నాయకుల అండదండలతో పాటు మత్స్య, పోలీస్ శాఖలకు సంబంధించి కింది స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు భారీగా ముడుపులు అందడమే ఇందుకు కారణమని ఆరోపణలు ఉన్నాయి. ప్రతి ఏటా పేరుకు మాత్రమే తనిఖీలు చేస్తున్నారని, దాడులు చేయాల్సి వస్తే సంబంధిత దళారులకు ఫోన్ ద్వారా ముందస్తు సమాచారం అందుతుండడంతో వైజాగ్ జాలర్లతో పాటు నిషేధిత వలలను రహస్య ప్రాంతాలకు తరలించేందుకు సహకారం అందిస్తున్నారన్న విమర్శలు గుప్పుమంటున్నాయి.

మల్లేశ్వరం వద్ద గుడారాలను ఏర్పాటు చేసుకున్న వైజాగ్ జాలర్లు, (ఇన్‌సెట్లో) అలవి వలలకు చిక్కిన చిన్న చేపపిల్లలను వేంకల్ సమీపంలో ఆరబెట్టిన జాలర్లు

ఏటా రూ.లక్షల్లో వేలం

కృష్ణానది తీర గ్రామాల్లో దళారులు తమ హద్దుబందులోని స్థలానికి (పట్టుకు) ఏటా వేలం నిర్వహిస్తారు. హద్దు(పట్టు)ను బట్టి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు తమ స్థలాన్ని వేలంలో లీజుకు ఇస్తారు. వేలం రెండు నెలల ముందే నిర్వహించి ఆంధ్రా జాలర్ల వద్ద అడ్వాన్స్ తీసుకుంటారు. స్థానిక దళారులతో చేతులు కలిపి సంబంధిత అధికారులతో మంతనాలు జరిపిన అనంతరం వివిధ శాఖాధికారులకు రూ.లక్షల్లో ముడుపులిచ్చాక వారితో హామీ తీసుకొని నిషేధిత వలలతో వేట కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానిక మత్స్యకారులు కోరుతున్నారు.

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

ప్రజల మనిషి డాక్టర్ బాలకిష్టయ్య

వనపర్తి టౌన్, నవంబర్ 15 : ప్రజల మనిషిగా డాక్టర్ బాలకిష్టయ్య చిరస్థాయిగా నిలిచారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా దవాఖానలో కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలకిష్టయ్య వైద్య వృత్తిలో ఎంతోమంది పేదల ప్రాణాలు కాపాడి ప్రజా డాక్టర్‌గా పేరు తెచ్చుకున్నారన్నారు. 25 ఏండ్లు సర్పంచుగా, చైర్మన్‌గా పనిచేసి వనపర్తికి శాశ్వత తాగునీటి పథకం ఏర్పాటు చేసినట్లు గుర్తుచేశారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసి ఎంతో అభివృద్ధి సాధించారన్నారు. ప్రతి మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, హైస్కూల్‌తోపాటు జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారన్నారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడంలో డాక్టర్ బాలకిష్టయ్య కృషి మరువలేనిదన్నారు. బాలకిష్టయ్య ప్రధాన అనుచరుడు బలరాం వారి జీవిత విశేషాలతో పుస్తకం ఆవిష్కరణ చేశారని, మరోసారి రెండో సంకలనం వచ్చేలా కృషి చేస్తే తన సహకారం ఉంటుందని తెలిపారు. డాక్టర్ భూపేశ్ మాట్లాడుతూ ఏటా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అందుకు సహకరిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, గట్టుయాదవ్, రమేశ్‌గౌడ్, వాకిటి శ్రీధర్, అశోక్, బాలపీరు, పరంజ్యోతి, కౌన్సిలర్లు నాగన్నయాదవ్, రవి, గులాం ఖాదర్, ఖాన్, ఇమ్రాన్, మతీన్, జోహెబ్ హుస్సేన్, సూర్యవంశపు గిరి, మాణిక్యం, మహేశ్వర్‌రెడ్డి, రాము, రమేశ్, ఆరీఫ్, ఏకే పాషా, మధుసార్, సుబ్బు, రవి, ఖాదర్, మన్నెం, ఖాదర్షా, రమేశ్, బలరాం, స్వరాజ్యం, శంకర్‌గౌడ్, నాగరాజు, బాలస్వామి, అమర్నాథ్, నందిమల్ల అశోక్ తదితరులు ఉన్నారు.

బాలకిష్టయ్య కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి

మార్కెట్లోకి డాజిలింగ్ న్యూ డిజైర్

మహబూబ్‌నగర్, నవంబర్ 15 : సరికొత్త హంగులతో అత్యాధునిక టెక్నాలజీతో నూతనంగా డాజిలింగ్ డిజైర్ మారుతి కారు మార్కెట్లోకి విడుదల చేసినట్లు శ్రీ జయరామ అధినేత బెక్కరి రాంరెడ్డి తెలిపారు. శుక్రవారం మహబూబ్‌నగర్‌లోని మెట్టుగడ్డలో గల మారుతి డిజైర్ షోరూంలో ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ అనిల్‌కుమార్ చేతులు మీదుగా సరికొత్త కారును ప్రారంభించారు. ఈ సందర్భంగా బెక్కరి రాంరెడ్డి మాట్లాడుతూ అత్యాధునిక హంగులతో మార్కెట్లోకి నూతన డాజిలింగ్ న్యూ డిజైర్ ప్రారంభ ఎక్స్ షోరూం ధర రూ.6.79 లక్షల నుంచి రూ.10.14 లక్షల వరకు ఉంటుందన్నారు. న్యూ డాజిలింగ్ డిజైర్ ప్రత్యేకతలు న్యూ జెడ్ సిరీస్ ఇంజిన్ బేసిక్ వేరియంట్‌లో ఆరు ఎయిర్ బ్యాగ్స్, షార్క్ ఫినాటినా ఏరియా, బూత్ లివ్ స్పాయిలర్, ఎల్ హోల్డ్ ఆసిస్ట్ 3డీ ట్రినిటీ, రేర్ ల్యాండ్ సిగ్నేచర్, రేర్ డీ ఫోగ్గర్ ఆల్ ఫోర్ పవర్ విండోస్, టాప్ ఎండ్‌లో వచ్చే వసతులు, త్రీడీ హెచ్‌డీ వ్యూ కెమెరా. వైర్‌లెస్ చార్జర్, టైర్ ప్రెజర్ మానిటరింగ్ సిస్టమ్, ఎలక్ట్రిక్ సన్ రూఫ్ ప్రిసిషన్ కట్, ఆలోయిస్ ఎల్ఈడీ క్రిస్టల్ విజన్ హెడ్ లాంప్స్, నెక్స్ జనరేషన్ సుజూకీ కనెక్ట్ కలిగి ఉండన్నారు. కార్యక్రమంలో సీఈవో విక్రమ్ యాదవ్, జనరల్ మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి, సేల్స్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, బ్యాంకర్లు, ఫైనాన్షియర్లు ఉన్నారు.

కారును విడుదల చేస్తున్న ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ అనిల్ కుమార్, బెక్కరి రాంరెడ్డి

ఫిట్‌నెస్ లేని బస్సులతో పరేషాన్

గద్వాలలో మార్గమధ్యంలోనే నిలిచిన బస్సు, శాఖాపూర్ వద్ద అదుపుతప్పి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లిన అద్దె బస్సు

- గద్వాల మేళ్లచెరువు వద్ద మార్గమధ్యంలోనే ఆగిపోయిన ఆర్టీసీ బస్సు
- గుడిబండ వద్ద హైవేపై బ్రేకులు ఫెయిలై చెట్టును ఢీకొట్టిన ఎక్స్‌ప్రెస్

గద్వాల అర్బన్, నవంబర్ 15 : ఫిట్‌నెస్ లేని బస్సులతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. కాలం చెల్లిన బస్సులను లాభాల కోసం రోడ్లపైకి తీసుకొచ్చి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్డాండ్ నుంచి అయిజకు బయలుదేరిన బస్సు మేళ్లచెరువు చౌరస్తా సమీపంలో నిలిచిపోయింది. బస్సులో దాదాపు 70 మంది వరకు ప్రయాణికులున్నారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆర్టీసీ డీఎం, సీఐలకు ఫోన్ చేసి గోడు వెల్లబోసుకున్నా ఎటువంటి స్పందన లేదని మండిపడ్డారు. బస్సు చెడిపోగా, ఇతర బస్సులు నిలుపకుండా వెళ్లిపోయినట్లు ఆరోపించారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు ఫిట్‌నెస్ లేని బస్సులను నడపకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ విషయమై డిపో మేనేజర్ మురళీకృష్ణను వివరణ కోరేందుకు ప్రయత్నించగా, అందుబాటులోకి రాలేదు.

ట్రాక్టర్‌ను తప్పించబోయి పొలాల్లోకి..

పెబ్బేరు, నవంబర్ 15 : కరీంనగర్ జిల్లా నుంచి అలంపూర్ జోగుళాంబ అమ్మవారి దర్శనానికి భక్తులతో బయలుదేరిన వోల్వో బస్సు ప్రమాదానికి గురికాగా, పలువురి గాయాలయ్యాయి. ఈ ఘటన 44వ నెంబరు జాతీయరహదారిపై పెబ్బేరు వద్ద శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకున్నది. ఎస్సై హరిప్రసాదరెడ్డి కథనం ప్రకారం.. కరీంనగర్ జిల్లా దుర్సెడు గ్రామం నుంచి 50మంది భక్తులు కార్తీకమాసాన్ని పురస్కరించుకొని అలంపూర్‌కు బయలుదేరారు. వారు ప్రయాణిస్తున్న బస్సు ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను తప్పించబోయి అదుపుతప్పి పొలాల్లోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో 10మందికి గాయాలయ్యాయి. వీరిని వెంటనే పెబ్బేరు, వనపర్తి దవాఖానలకు తరలించి చికిత్స అందించారు. బస్సు క్లీనర్ మహ్మద్ పాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అదుపుతప్పిన బస్సు : తప్పిన ప్రమాదం

మూసాపేట(అడ్డాకుల), నవంబర్ 15 : ఆర్టీసీ బస్సు అదుపుతప్పి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లిన ఘటనలో 53 మంది సురక్షితంగా బతికి బయటపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. వనపర్తి డిపోకు చెందిన షటిల్ ఎక్స్‌ప్రెస్ బస్సు వనపర్తి నుంచి మహబూబ్‌నగర్‌కు బయలుదేరగా, అడ్డాకుల మండలం గుడిబండ స్టేజీ సమీపంలోని శాఖాపూర్ జాతీయ రహదారి వద్ద బస్సు బ్రేకులు పడలేదన్నారు. దీంతో డ్రైవర్ అప్రమత్తమై గేర్ల సహాయంతో అదుపుచేస్తూ చెట్టును ఢీకొట్టినట్లు తెలిపారు. దీంతో బస్సులో ఉన్న 14 మందికి స్వల్పగాయాలయ్యాయి. ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోకపోవడంతో ప్రయాణికులంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఇథనాల్ ఫ్యాక్టరీపై నోరు విప్పాలి

- మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ స్పందించాలి
- పరిపాలన చేతగాకనే బీఆర్ఎస్ నేతల అరెస్టులు
- బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కుర్వ పల్లయ్య

అయిజ, నవంబర్ 15 : తుంగభద్ర నది తీరంలో ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేయిస్తామని అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌తో ప్రకటింపజేయించాలని బీఆర్ఎస్వీ జిల్లా నాయకుడు కుర్వ పల్లయ్య కాంగ్రెస్ నాయకులను డిమాండ్ చేశారు. శుక్రవారం అయిజలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పల్లయ్య మాట్లాడారు. అలంపూర్ నియోజకవర్గ ప్రజలను నట్టేట ముంచే ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేయించి నియోజకవర్గ ప్రజల పక్షాన ఉంటాడా, కార్పొరేట్ శక్తుల పక్షాన నిలబడతారో తేల్చుకోవాలన్నారు. ఎమ్మెల్యే విజయుడు రైతులతో కలిసి ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి వ్యతిరేకంగా ధర్నా చేసి స్పష్టంగా ప్రకటించారన్నారు. ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి సైతం ఫ్యాక్స్ ద్వారా ఉత్తరం పంపారన్నారు. ఇథనాల్ ఫ్యాక్టరీ రద్దు చేస్తామని ప్రకటించేందుకు మీరు సిద్ధంగా ఉన్నారా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలపై అవాకులు, చవాకులు మాట్లాడే ముందు మీ స్థాయి ఏమిటో తెలుసుకుని మాట్లాడాలన్నారు. దామగుండం రాడార్ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి చేసినా కేసీఆర్ హయంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం 2,900 ఎకరాల భూమిని అప్పగించేందుకు ఒప్పుకోలేదన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను గాలికొదిలేసి విహారయాత్రలు చేస్తూ ఢిల్లీకి మూటలు మోస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి పరిపాలనపై సోయిలేదన్నారు. పాలన చేయడం చేతగాక బీఆర్ఎస్ శ్రేణులు, కార్యకర్తలను అరెస్టు చేస్తూ పబ్బం గడుపుకొంటున్నారని విమర్శించారు. లగచర్లలో ఫార్మా కంపెనీ బాధితులను పోలీసులతో నిర్బంధించి ఉగ్రవాదులను అరెస్టు చేసిన విధంగా అర్ధరాత్రి పోలీస్ స్టేషన్లకు తరలించడం విడ్డూరంగా ఉందన్నారు. కేసీఆర్ హయంలో ఫ్యాక్టరీలు పెట్టే సమయంలో రైతులతో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకున్నట్లు గుర్తుచేశారు. సమావేశంలో బీఆర్ఎస్వీ నాయకులు మత్తాలి, మైబు, అనిల్ గౌడ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ జిల్లా నాయకుడు కుర్వ పల్లయ్య

మత్స్యశాఖ అధికారిణిపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్సీకి వినతిపత్రం అందజేస్తున్న మత్స్యకారులు

నాగర్‌కర్నూల్, నవంబర్ 15 : నాగర్‌కర్నూల్ జిల్లా మత్స్యశాఖాధికారి రజిని అరాచకాలపై నియోజకవర్గంలోని మత్స్యకారులు ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. సదరు మత్స్యశాఖాధికారి కాంట్రాక్టర్లతో కుమ్మక్కై మత్స్యకారులను మోసం చేస్తున్నదని, కులం పేరుతో బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని కల్వకుర్తి మండలంలో చేపపిల్లల పంపిణీ కార్యక్రమంలో మత్స్యకారులను, జిల్లా డైరెక్టర్లపై పోలీస్ కేసు పెడతానని బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పీజీ లక్ష్మాపూర్‌లో చేపపిల్లల సీడ్ తక్కువగా ఇవ్వడంతో ప్రశ్నించి అక్కడి మత్స్యకాలపై కూడా బెదిరింపులకు పాల్పడినట్లు తెలిపారు. 2019లో ఐఎఫ్‌డీఎస్ స్కీం ద్వారా ప్రభుత్వం ఇచ్చిన 75శాతం సబ్సిడీపై టీవీఎస్, మోపెడ్, ఆటోలపై అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నందున 9 నెలల కాలంలో నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి ఇతర జిల్లాలకు బదిలీ కావడం జరిగిందన్నారు. ఇతర జిల్లాలో పనిచేసిన తర్వాత ఈసంవత్సరం మళ్లీ నాగర్‌కర్నూల్ జిల్లా అధికారిగా బాధ్యతలు చేపట్టి అదేవిధంగా ప్రవర్తిస్తున్నారని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చిన చేపపిల్లల పంపిణీ టెండర్‌ను అవకాశంగా మలుచుకొని నాసిరకం చేప పిల్లలను సరఫరా చేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నిస్తున్న మత్స్యకారులను సభ్యత్వం నుంచి తొలగిస్తానని, సంఘాన్ని రద్దు చేస్తానని బెదిరిస్తున్నారని, కొందరికి నోటీసులు కూడా జారీ చేశారని గుర్తు చేశారు. సింగోటం రిజర్వాయర్, పాలెం చెరువుల్లో వదిలిన చేప పిల్లలు రెండు అంగుళాలు కూడా లేవని, కౌంటింగ్ కూడా లేవన్నారు. అచ్చంపేటలో ఎస్టీ మత్స్యకారులకు చంద్రసాగర్ రిజర్వాయర్‌లో కౌంటింగ్ లేకుండా చేపపిల్లలు వదిలిపెట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సభ్యత్వం లేనివారికి సైతం చేపలు పట్టే అవకాశం ఇవ్వాలని అధ్యక్షులకు, కార్యదర్శులకు చెబుతూ వారి మధ్య సంఘంలో గొడవలు పెడుతున్నారన్నారు. జిల్లా మత్స్యశాఖాధికారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కార్తీక శోభను సంతరించుకున్నది. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని ఆయా ఆలయాల వద్ద దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. ఇండ్లల్లో నోములు, వ్రతాలు చేశారు.